# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 14-07-2024** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలను కలిపే రాయదుర్గం – తుమకూరు రైల్వేలైన్ పనులను 2026 సంవత్సరానికి పూర్తి చేస్తామని కేంద్ర రైల్వే శాఖ సహాయ మంత్రి వి.సోమన్న తెలిపారు.**
2. **అతిసారం కట్టడికి రాష్ట్రప్రభుత్వం చర్యలు చేపడుతోందని ఆంధ్రప్రదేశ్ పురపాలక శాఖ మంత్రి పొంగూరి నారాయణ చెప్పారు.**
3. **త్వరలో యూపీఎస్సీ తరహాలో జాబ్ క్యాలెండర్‌ను ప్రకటిస్తామని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి వెల్లడించారు.**
4. **ఆంధ్రప్రదేశ్‌లో గంజాయి నియంత్రణకు వంద రోజుల ప్రణాళిక రూపొందించామని డీజీపీ ద్వారకా తిరుమల రావు తెలిపారు.**
5. **ఆంధ్రప్రదేశ్‌లోని చేనేత సంఘాలను పూర్తిగా ప్రక్షాళన చేస్తామని చేనేత జౌళి శాఖ మంత్రి సవిత తెలిపారు.**

==========================

ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలను కలిపే రాయదుర్గం – తుమకూరు రైల్వేలైన్ పనులను 2026 సంవత్సరానికి పూర్తి చేస్తామని కేంద్ర రైల్వే శాఖ సహాయ మంత్రి వి.సోమన్న తెలిపారు. శ్రీసత్యసాయి జిల్లా మడకశిర నియోజకవర్గంలో నిన్న కేంద్ర మంత్రి పర్యటించి... మడకశిర రైల్వేలైన్ పనులు పరిశీలించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. రాయదుర్గం – తుమకూరు రైల్వేలైన్ పనులు ఏడాదిన్నరలోపు పూర్తయ్యేలా చూడాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రత్యేకంగా ఆదేశించారని తెలిపారు.

-------------------------

అతిసారం కట్టడికి రాష్ట్రప్రభుత్వం చర్యలు చేపడుతోందని ఆంధ్రప్రదేశ్ పురపాలక శాఖ మంత్రి పొంగూరి నారాయణ చెప్పారు. పల్నాడు జిల్లా పిడుగురాళ్లలో అతిసారం ప్రబలిన మారుతీనగర్, లెనిన్‌నగర్‌లలో నిన్న మంత్రి రెండోసారి పర్యటించారు. ఆయా ప్రాంతాల్లో మురుగునీటి పారుదల వ్యవస్థను పరిశీలించారు. లెనిన్‌నగర్ ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ... నీటికాలుష్యం వల్లే డయేరియా వ్యాప్తి చెందిందన్నారు. పిడుగురాళ్లలోని పది బోర్ల నీటి నమూనాలు సేకరించి పరీక్షించగా.. ఎనిమిది బోర్ల నీటిలో నైట్రేట్ ఎక్కువగా ఉన్నట్లు తేలిందన్నారు. రెండురోజుల్లో మురుగు కాలువల్లో పూడిక తీయించాలని అధికారులకు ఆదేశించినట్లు చెప్పారు. మురుగు తొలగించడానికి 10 లక్షల రూపాయలు మంజూరు చేస్తున్నట్లు మంత్రి నారాయణ ప్రకటించారు.

---------------------------

త్వరలో యూపీఎస్సీ తరహాలో జాబ్ క్యాలెండర్‌ను ప్రకటిస్తామని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి వెల్లడించారు. ఏటా మార్చి 31వ తేదీలోగా అన్ని శాఖల్లోని ఖాళీల వివరాలను పరిశీలించి జూన్ 2వ తేదీన నోటిఫికేషన్లు జారీ చేసి డిసెంబరు 9వ తేదీలోపు భర్తీ ప్రక్రియ పూర్తి చేసేలా చట్టబద్ధత తీసుకురానున్నామని తెలిపారు. జాబ్ క్యాలెండర్ అంశాన్ని శాసన సభలో సవివరంగా ప్రకటిస్తామని వెల్లడించారు. నిన్న హైదరాబాద్‌లోని జేఎన్టీయూలో ఏర్పాటు చేసిన 'నాణ్యమైన ఇంజినీరింగ్ విద్య' అనే కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సెప్టెంబరు 5, 6 తేదీల్లో హైదరాబాద్‌లో నిర్వహించనున్న 'ఏఐ గ్లోబల్ సమ్మిట్ హైదరాబాద్ 2024' లోగోను ఆవిష్కరించారు. అనంతరం ఎన్ఎస్ఎస్ విద్యార్థులతో ముఖ్యమంత్రి మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం మాదక ద్రవ్యాలపై యుద్ధం ప్రకటించిందని.. అందులో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. డ్రగ్స్‌ను నియంత్రించేందుకు డీజీపీ నేతృత్వంలో 400 మందితో తెలంగాణ నార్కోటిక్ బ్యూరోను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో గంజాయి నియంత్రణకు వంద రోజుల ప్రణాళిక రూపొందించామని డీజీపీ ద్వారకా తిరుమల రావు తెలిపారు. గంజాయి, మాదక ద్రవ్యాల దుష్ప్రభావాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు సదస్సులు నిర్వహిస్తున్నట్లు డీజీపీ పేర్కొన్నారు. తిరుపతి పోలీసు అతిథిగృహంలో రాయలసీమ జిల్లాల ఎస్పీలతో నిన్న ఆయన నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో గంజాయి, మాదకద్రవ్యాల అక్రమ రవాణా.. వినియోగం కట్టడికి ప్రత్యేకదృష్టి సారించామని వెల్లడిస్తూ...

- వాయిస్..30 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని చేనేత సంఘాలను పూర్తిగా ప్రక్షాళన చేస్తామని చేనేత జౌళి శాఖ మంత్రి సవిత తెలిపారు. కృష్ణా జిల్లా గూడూరు మండలం పోలవరం గ్రామంలో చేనేత కార్మికుల ముఖాముఖి కార్యక్రమంలో మంత్రి సవిత నిన్న పాల్గొన్నారు. చేనేత సహకార సంఘాల గోదాముల్లో నిలువ ఉన్న చేనేత వస్త్రాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చేనేత కార్మికుల సంఘాలను బలోపేతం చేస్తామని వారి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇస్తూ ..

.......వాయిస్.....20 సెకన్లు

---------------------------

ప్రకృతి వ్యవసాయాన్ని రైతులకు చేరువ చేసేందుకు రానున్న రోజుల్లో మరింత కృషి చేస్తామని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు తెలిపారు ఆంధ్ర ప్రదేశ్ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయం ఏపీసిఎన్ఎఫ్ కు "గుల్బెంకియన్ ప్రైజ్ ఫర్ హ్యూమానిటి" పురస్కారం వచ్చిన సంధర్భంగా మంత్రి ఏపీసిఎన్ఎఫ్ ప్రతినిధులకు, రాష్ట్రంలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులకు శుభాకాంక్షలు తెలిపారు. రానున్న రోజుల్లో రాష్ట్రంలోని 60 లక్షల మంది రైతులకు ప్రకృతి వ్యవసాయాన్ని చేరువ చేయాలన్న సంకల్పంతో ముందుకు వెళ్తున్నామని.. ఈ విధానంపై వివిధ రాష్ట్రాలు, ఇతర దేశాలు అనుసరిస్తున్న విధానాలను అధ్యయంన చేస్తామని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు.

---------------------------

విశాఖపట్నంలోని ముడా సర్లోవ పార్క్ పరిసరాల్లో పర్యావరణానికి హాని కలిగించే ఎలాంటి చర్యలూ చేపట్టవద్దని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ జీవీఎంసీ అధికారులకు

దిశానిర్దేశం చేశారు. ముడా సర్లోవ పార్కులో జీవీఎంసీ కట్టడాలు చేపడితే పర్యావరణ విధ్వంసానికి దారి తీస్తుందంటూ విశ్రాంత ఐఏఎస్ అధికారి, పర్యావరణవేత్త ఈ.ఎ.ఎస్. శర్మ రాసిన లేఖపై పవన్ కళ్యాణ్ స్పందించారు. నిత్యం వందలాది మంది ప్రజల సందర్శించే ముడా సర్లోవ పార్కు 105 రకాల పక్షులకు ఆవాస ప్రాంతమని, దానిని పరిరక్షించాలని అధికారులను ఉపముఖ్యమంత్రి ఆదేశించారు.

--------------------------

పశువుల షెడ్ల నిర్మాణానికి 90 శాతం రాయితీ ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. గొర్రెలు, మేకలు, కోళ్లకు షెడ్లు నిర్మించుకుంటే 70 శాతం రాయితీ ఇస్తుంది. యూనిట్‌కు గరిష్ఠంగా 60 వేల 900 రూపాయల నుంచి 2 లక్షల 7 వేల రూపాయల వరకు పెంపకందారులకు లబ్ధి చేకూరనుంది. జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద దీన్ని అమలు చేయనుంది. షెడ్ల నిర్మాణాల రాయితీ వివరాలను వ్యవసాయశాఖ మంత్రి కార్యాలయం విడుదల చేసింది.

--------------------------

ప్రజల అవసరాలకు అనుగుణంగా అత్యవసరాలైన ముడిచమురు విద్యుత్ వంటనూనెల వంటి వస్తువుల విషయంలో దేశీయ ఉత్పాదకత పెరిగితే దిగుమతుల భారం తగ్గి ఆర్థిక వ్యవస్థ పరిపుష్టమవుతుందని మిజోరం గవర్నర్ డాక్టర్ కంభంపాటి హరిబాబు తెలిపారు. విశాఖలోని ఆంధ్ర విశ్వవిద్యాలయం లో నిన్న జరిగిన ఒక పుస్తక ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరిబాబు మాట్లాడుతూ సామాన్య ప్రజలకు ఆర్థిక భారం తగ్గించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఇథనాలు, సౌర విద్యుత్తు, నూనె గింజల దేశీయ ఉత్పాదకతను పెంచేందుకు ప్రత్యేక దృష్టి సారించిందని పేర్కొన్నారు. రహదారులు మౌలిక సదుపాయాలు సమాచార ప్రసార వ్యవస్థ బ్యాంకింగ్ రంగాలలో మన దేశం మునిపెన్నడూ లేని ప్రగతి సాధించిందని హర్షం వ్యక్తం చేశారు.

--------------------------

ఉపరితల ఆవర్తనం, ద్రోణి ప్రభావంతో ఆంధ్రప్రదేశ్ లో పలు చోట్ల భారీవర్షాలు కురుస్తున్నాయి. మరో రెండు రోజుల పాటు కోస్తా జిల్లాల్లో భారీ వర్షాలు, రాయలసీమలో ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని.. గంటకు 30 నుంచి 40 కి.మీ. వేగంతో ఈదురుగాలులు వీస్తాయని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది..

కృష్ణా జిల్లా మచిలీపట్నంలో నిన్న అత్యధికంగా 154 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఉమ్మడి గుంటూరు, నెల్లూరు, తిరుపతి, తూర్పుగోదావరి, బాపట్ల జిల్లాల్లోనూ భారీవర్షాలు కురిశాయి. రాయలసీమ జిల్లాల్లో వర్షాల ప్రభావం ఎక్కువగా ఉంది. రెండు రోజులుగా కురుస్తున్న వానలకు ఈదురుగాలులు తోడు కావడంతో కొన్నిచోట్ల చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. మరికొన్నిచోట్ల విద్యుత్తు సరఫరా నిలిచింది. కోస్తాలో పలుచోట్ల పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. ప్రస్తుతం కురుస్తున్న వానలు ఖరీఫ్ సాగుకు అనుకూలిస్తాయని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఇదిలా ఉండగా తెలంగాణ రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఈరోజు నుంచి నాలుగు రోజులపాటు భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్‌లోని వాతావరణశాఖ తెలిపింది. ఈ మేరకు నాలుగు రోజులకు గాను 'పసుపు' రంగు హెచ్చరిక జారీ చేసింది. ఈరోజు నిర్మల్, నిజామాబాద్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది.

=====================